క్లుప్తంగా

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బిక్కవోలు/రంగంపేట : రంగంపేట ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ పోస్టులకు భర్తీ చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు రంగంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ఎ.జెస్సీఫ్లోరెన్స్ అన్నారు. బిక్కవోలు మండలం కాపవరం- 2 (బీసీ-ఏ)అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త పోస్టు ఖాళీగా ఉందన్నారు. అలాగే కొమరిపాలెంలోని రామన్నపేటలో (ఎస్సీ), (బీసీ-బి), ఆరికరేవుల గ్రామంలోని వెలమపేట (ఓసీ). బలభద్రపురం (ఎస్సీ), అనపర్తి మండలం కుతుకులూరు (ఓసీ), రంగంపేట మండలం చంద్రేడు (ఎస్టీ)లో ఆయాల ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. అదే గ్రామానికి చెందిన వారు అర్హులన్నారు. పదో తరగతి చదువు, 21 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు ఉండాలని, దరఖాస్తులను ఈనెల 20వ తేదీ లోపు రంగంపేట ఐసీడీఎస్ కార్యాలయం అందించాలన్నారు.

రాజానగరం పరిధిలో..

రాజానగరం: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలలో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను ప్రాజెక్టు సీడీపీఓ టి.నాగమణి గురువారం తెలిపారు. రాజానగరం మండలం సూర్యారావుపేట-1 (ఓసీ), తోకాడ - 3 (ఓసీ), పాలచర్ల - 2 (ఎస్సీ) అంగన్‌వాడీ కేంద్రాలలో కార్యకర్త పోస్టులు, దివాన్‌చెరువు - 3 (ఓసీ), పాలచర్ల - 3 (ఓసీ) సహాయకురాలు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే రాజమహేంద్రవరం రూరల్ మండలం పుష్కరాలపేట - 7 (ఓసీ), పిడింగొయ్యి - 3 (ఓసీ), ధవళేశ్వరం - 16 (ఎస్సీ), ధవళేశ్వరం - 24 (బీసీ-సి), కాతేరు - 11 (బీసీ-డి), కడియం మండలం కడియపులంక - 7 (ఓసీ), ఎంఆర్ పాలెం -1 (ఓసీ), వేమగిరి - 12 (బీసీ-బీ)లో సహాయకుల పోస్టులను భర్తీ చేస్తామన్నారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు తమ దరఖాస్తును రాజానగరంలోని తమ కార్యాలయంలో అందజేయాలన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



కోరుకొండలో వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

మధురపూడి: కోరుకొండ మండలంలోని బాధిత కుటుంబాలను వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి గురువారం పరామర్శించారు. కోరుకొండకు చెందిన గోపిశెట్టి వెంకటేశ్వరరావు, గుమ్ములూరుకు చెందిన తుమ్మల సత్యనారాయణ ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు.

చట్టాలపై అవగాహన అవసరం



వేంద్రలో మాట్లాడుతున్న సూపర్ వైజర్ పద్మావతి

పెదపూడి: మిషన్ శక్తి కార్యక్రమం ద్వారా బాలికలు, మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని కాకినాడ అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సంపర సెక్టార్ సూపర్ వైజర్ పద్మావతి అన్నారు. వేంద్ర, సంపర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం పోషకాహార మాసోత్సవాలు, మిషన్ శక్తి కార్యక్రమం నిర్వహించారు. సంపర ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు జరిపారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ సమతుల్య ఆహారం తీసుకోవడంతో కలిగే ప్రయోజనాలు వివరించారు. ఈ చట్టాలపై అవగాహన పెంచుకోవడంతో బాలికలు, మహిళలు వారిని వారే కాపాడుకుంటారన్నారు. బాల్యవివాహాలు చేయరాదని, ఆడవారితో అసభ్య ప్రవర్తన తగదని, గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ చేయకూడదని తెలిపారు.

పార్టీలకు అతీతంగా ఆలయ అభివృద్ధి



సరకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట గ్రామంలోని ఉమా రామలింగేశ్వరస్వామి, బాల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల పునర్నిర్మాణం, అభివృద్ధిని పార్టీలకు అతీతంగా చేపడదామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. స్థానిక ఎన్డీఏ నాయకులు, గ్రామ పెద్దలతో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాల పునర్నిర్మాణం, అభివృద్ధికి గ్రామస్తులు స్పందిచిన తీరు అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఆలయాల అభివృద్ధికి గ్రామస్తులు ఇచ్చిన చెక్కులను ఆయన స్వీకరించారు. అనంతరం ఇటీవల కురిసిన వర్షాలకు ఇళ్లు కూలిపోయి నిరాశ్రయులైన కొండా మల్లికార్జునరావు, బొంతు చంద్రరావు, లావేటి లక్ష్మి, బొంతు శ్రీను కుటుంబాలకు 25 కేజీల చొప్పున బియ్యం, నిత్యావసరాలను పంపిణీ చేశారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

- ఘనంగా గణపతి నవరాత్ర ఉత్సవాలు
- ప్రారంభమైన నిమజ్జనాలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు



పందలపాకలో గణపతిని నిమజ్జనం చేస్తున్న భక్తులు (ఫైల్)

బిక్కవోలు: గణపతి నవరాత్ర ఉత్సవాలు వాడవాడలా వైభవంగా జరుగుతున్నాయి. కొన్నిచోట్ల విగ్రహాల నిమజ్జనోత్సవాలు జోరందుకున్నాయి. వినాయక విగ్రహాల నిమజ్జనాల సందర్భంగా ఏటా ఎక్కడో చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అందుకే ఈ ఏడాది ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పూర్తి స్థాయిలో కమిటీ నిర్వాహకులే బాధ్యత తీసుకోవాలని పోలీసులు చెబుతున్నారు.

అనపర్తి నియోజకవర్గంలో..

అనపర్తి నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల్లో సుమారు 480 వరకూ గణపయ్య విగ్రహాలను ప్రతిష్ఠించారు. వాటిలో ఎక్కువ విగ్రహాలను సామర్లకోట కాలువ, తుల్యభాగ నదిలో నిమజ్జనం చేస్తారు. వినాయక ప్రతిమల ఊరేగింపు వరకూ సజావుగానే జరుగుతున్నా నిమజ్జనం కోసం విగ్రహాలను నీటిలోకి దింపే సమయంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. భారీ విగ్రహాలు చాలా బరువు ఉండడంతో వాటిని నదిలో విడిచేందుకు దూకుడుగా వ్యవహరించడం, అజాగ్రత్తగా ఉండడంతో అనుకోని ప్రమాదాలు సంభవించి ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోంది.

పలు ఘటనలు

2018లో అనపర్తి వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేయడానికి వెళ్లిన బీసీ హాస్టల్ విద్యార్థి ములగపాక శివరామ సంతోష్ (13) కాలువలో గల్లంతయ్యాడు. అదే ఏడాది వినాయక చవితి కాలువ స్నానం చేయడానికి వెళ్లిన వెదురుపాక చెందిన విద్యార్థి దుర్గాప్రసాద్ కొంకుదురు బుడితల మామిడి వద్ద కాలువలో మునిగి చనిపోయాడు. గత ఏడాది తొస్సిపూడి వద్ద కొమరిపాలెం గ్రామానికి చెందిన తేతలి నాగవీర వెంకట రామారెడ్డి (20) నిమజ్జనంలో గల్లంతై మృతి చెందాడు.

నిమజ్జన సమయంలో..

గతంలో నిమజ్జనం సందర్భంగా చోటుచేసుకున్న పలు సంఘటనలను పరిశీలిస్తే.. కాలువల లోతు, స్థితిగతులు తెలియక ప్రమాదాల బారినపడినట్టు స్పష్టమవుతోంది. అలాంటివి జరగకుండా కర్రల సాయంతో లోతును గుర్తించిన తరువాతే కాలువలోకి దిగడం మంచిది. భారీ విగ్రహాలను వాహనాల నుంచి దించే సమయంలో అప్రమత్తంగా ఉండాలి. వాటిని క్రేన్ల సహాయంతోనే నీటిలోకి దించడం మేలు. విగ్రహాల నిమజ్జన ప్రదేశం వద్ద గజఈతగాళ్లను అందుబాటులో ఉంచుకోవాలి. పిల్లలను నిమజ్జన ప్రదేశాలకు దూరంగా ఉంచాలి.

బాణసంచాతో జాగ్రత్త

ఎంత ఎక్కువ బాణాసంచా కాల్చితే అంత గొప్పగా భావిస్తున్న ఉత్సవ కమిటీలు.. వాటిని కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి. సరదా కోసం పిల్లలు కూడా బాణసంచా కాల్చేందుకు ఉత్సాహం చూపిస్తుంటారు. ప్రమాదాల బారిన పడే అవకాశం ఉన్నందున వారిని బాణసంచాకు దూరంగా ఉంచాలి. మందుగుండు సామగ్రినంతటినీ ఒకే వాహనంపై ఉంచే ప్రయత్నం చేయరాదు. జనవాసాల వద్ద, రద్దీ కూడళ్లలో , ఆస్పత్రుల వద్ద బాణసంచా కాల్చడం అనేక అనర్థాలకు దారి తీస్తుంది.



బిక్కవోలులో క్రేన్ సాయంతో విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు (ఫైల్)

కమిటీలు పర్యవేక్షించాలి



"గణపతి విగ్రహాల నిమజ్జనం కార్యక్రమాలను ఉత్సవ కమిటీలు దగ్గరుండి పర్యవేక్షించాలి. దాని పూర్తిస్థాయి బాధ్యత వారిదే. పిల్లలను నిమజ్జనం వద్దకు రానివ్వకూడదు. బాణసంచా విషయంలోనూ జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా పోలీసు శాఖ సూచించిన నిబంధనలు విధిగా పాటించాలి."

– వాసింశెట్టి రవిచంద్ర కుమార్, ఎస్సై, బిక్కవోలు

నేడు మండల స్థాయి స్కూల్ గేమ్స్

బిక్కవోలు: మండల స్థాయి స్కూల్ గేమ్స్ టోర్నమెంట్, ఎంపికలు శుక్రవారం బిక్కవోలు ఉన్నత పాఠశాల వద్ద జరుగుతాయని ఎంఈవో - 2 కె.పూర్ణచంద్రరావు తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, చెస్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా పోటీలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన అన్ని పాఠశాలలకు చెందిన 14 నుంచి 17 ఏళ్ల వయసున్న క్రీడాకారులందరూ వీటిలో పాల్గొనవచ్చన్నారు. వీటిలో ప్రతిభ చూపిన వారునియోజకవర్గం స్థాయి ఎంపికలలో పాల్గొనడానికి అర్హత సాధిస్తారన్నారన్నారు.

సారా విక్రేత అరెస్టు

రంగంపేట: సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్సై తోట కృష్ణసాయి తెలిపారు. ఆయన గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. జి.దొంతమూరు గ్రామ శివారులో మాదబోయిన రాముడు సారా విక్రయిస్తూ పట్టుబడ్డాడు. అతడి నుంచి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి పెద్దాపురం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజానగరం: కలవచర్ల 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. ఈ నేపథ్యంలో కలవచర్ల, సీతారామపురం గ్రామాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలకు త్వరలో ఉత్తర్వులు



భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ

రాజానగరం: నియోజకవర్గ కేంద్రమైన రాజానగరంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి సానుకూలత వచ్చిందని, ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించేలా త్వరలోనే ఉత్తర్వులు వెలువడనున్నాయని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తెలిపారు. ఇందుకోసం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మాణం పూర్తయిన ఒక భవనాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కళాశాల ఏర్పాటు ద్వారా ఈ ప్రాంతంలో విద్యార్థులు సాంకేతిక విద్య అభ్యసించేందుకు అవకాశం ఉంటుందన్నారు.

21న ఎల్‌ఐసీ ఉద్యోగుల మహాసభ

రాజమహేంద్రవరం రూరల్: జీవిత బీమా ఉద్యోగుల సంఘం 27వ వార్షిక మహాసభను ఈ నెల 21వ తేదీన రాజమహేంద్రవరం మోడల్ కాలనీలోని ఉద్యోగుల సంఘం భవనంలో నిర్వహించనున్నట్టు ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుబ్బల రాంబాబు, ఎం.కోదండరామ్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఉదయం మోరంపూడిలోని జీవిత బీమా సంస్థ ప్రధాన కార్యాలయ ఆవరణలో మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాలలోని 20 శాఖా కార్యాలయాల ఉద్యోగులు ఈ సభకు హాజరవుతారన్నారు. కోదండరాం మాట్లాడుతూ ముఖ్య అతిథులుగా జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు పి.సతీష్, వి.రవీంద్రనాథ్ హాజరవుతారన్నారు. సుదీర్ఘకాలం ఉద్యోగుల సంఘం నాయకుడిగా పనిచేసి, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ఉంటూ స్వచ్ఛందంగా విరమణ చేస్తున్న గుబ్బల రాంబాబును ఉభయ జిల్లాల ఉద్యోగుల సంఘం తరఫున సత్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

పంట నష్టం అంచనాలు త్వరగా నమోదు చేయాలి



కరకుదురులో నీట మునిగిన వరిదుబ్బును ఏడీఏ రత్న ప్రశాంతికి చూపిస్తున్న రైతు



ఏపీత్రయం వంతెన వద్ద పశ్చిమ ఏలేరు కాలువకు తగ్గిన వరద ఉధృతి

పెదపూడి: పశ్చిమ ఏలేరు కాలువ ఉధృతితో పాడైన పంటలకు సంబంధించిన నష్టం అంచనాలను అధికారులు త్వరగా తయారు చేయాలని వ్యవసాయశాఖ కాకినాడ ఏడీఏ ఎం.రత్న ప్రశాంతి అన్నారు. మండలంలోని రామేశ్వరం, ఏపీత్రయం, కరకుదురు గ్రామాల్లో పశ్చిమ ఏలేరు కాలువ వరద ఉధృతితో నీట మునిగిన వరి పొలాలను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు నీట మునిగిన వరిదుబ్బులను ఆమెకు చూపించి, తమను తక్షణం ఆదుకోవాలని కోరారు. ఏడీఏ రత్న ప్రశాంతి మాట్లాడుతూ వరదలతో 2 వేల ఎకరాల్లో వరి పంట నీట మునిగిందన్నారు. నిబంధనల ప్రకారం పంట నష్టం అంచనాలు తయారు చేయాలన్నారు. ఏడీఏ వెంట ఏఓ టీవీఆర్ మణిదీప్, ఏఈఓ సత్యనారాయణ ఉన్నారు.

తగ్గిన వరద ఉధృతి

ఏపీత్రయం గ్రామంలోని వంతెన వద్ద పశ్చిమ ఏలేరు కాలువ వరద ఉధృతి రెండు అడుగులు మేర తగ్గిందని తహసీల్దార్ పీవీ సీతాపతిరావు తెలిపారు. ఆయన గురువారం ఏపీత్రయం గ్రామంలోని పశ్చిమ ఏలేరు కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు రోజులుగా పెరిగిన వరద ప్రస్తుతం రెండడుగుల మేర తగ్గుముఖం పట్టిందన్నారు. పరిస్థితి అదుపులో ఉందన్నారు. వీఆర్వోలు జి.అంజిబాబు, కె.రమేష్‌బాబు, సచివాలయం కార్యదర్శులు బాలత్రిపుర సుందరి, అచ్చిరాజు తదితర బృందం అప్రమత్తంగా ఉండి పర్యవేక్షణ చేస్తున్నారన్నారు. రామేశ్వరం, ఏపీత్రయం, కరకుదురు గ్రామాల్లో నీటి మునిగిన వరి పొలాలకు పంటనష్టం అంచనాలను అధికారులు తయారు చేస్తున్నారన్నారు.

జీఓ 85 రద్దు చేసే వరకూ నిరసన



డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న పీహెచ్‌సీల వైద్యులు

రాజమహేంద్రవరం రూరల్: జీఓ 85ని రద్దు చేసేవరకు తమ నిరసన కొనసాగిస్తామని జిల్లా పీహెచ్‌సీ వైద్యుల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ మౌనిక స్పష్టం చేశారు. స్థానిక డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం ఆవరణలో గురువారం భోజన విరామ సమయంలో పీహెచ్‌సీల వైద్యులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. పీహెచ్‌సీ వైద్యుల నిరసనను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తమకు న్యాయం జరిగేలా చూడాలని ఆయనను కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ మౌనిక మాట్లాడుతూ మూడు రోజులుగా నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తున్నామన్నారు. రేపటి నుంచి రెండు రోజుల పాటు అత్యవసర సేవలు మాత్రమే చూస్తారని, ఈ నెల 15వ తేదీన చలో విజయవాడ ర్యాలీ, 16 నుంచి నుంచి నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టడం జరుగుతుందన్నారు. తమ హక్కుల కోసం పోరాడుతూ, తమకు న్యాయం జరిగే వరకు ఈ పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. నిరసనలో అధిక సంఖ్యలో పీహెచ్‌సీల వైద్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం



కొంకుదురులో గణపతి పూజ చేస్తున్న దంపతులు



రంగంపేటలో మాట్లాడుతున్న విశాఖ డెయిరీ మేనేజర్ రవికుమార్

బిక్కవోలు: కొంకుదురు గ్రామంలోని వెలంపేటలో ఉన్న లక్ష్మీ గణపతి ఆలయంలో గురువారం లక్ష గరిక పూజ, గణపతి హోమం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అర్చకుడు రమణశర్మ, 12 మంది రుత్వికులతో కలిసి పూజలు చేశారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, లక్ష గరిక పూజ, గణపతి హోమంలో 108 దంపతుల జంటలు పాల్గొన్నారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.

అన్నసమారాధన

రంగంపేట: గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా విశాఖ డెయిరీ తులసీ రెసిడెన్సీ వద్ద ఏర్పాటు చేసిన గణపతి మంటపంలో గురువారం అన్నసమారాధన నిర్వహించారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. డెయిరీ మేనేజర్ రవి కుమార్ మాట్లాడుతూ రెసిడెన్సీ ప్రారంభించిన మూడేళ్ల నుంచి ప్రతీ ఏటా ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. డిప్యూటీ మేనేజర్ భూలోక నాయుడు, వినయ్ కుమార్, శ్రీనివాస్, శ్రావణ్, రమణబాబు పాల్గొన్నారు.

ప్రాణాలతో సెల్‌గాటం

- యథేచ్ఛగా సెల్ ఫోన్ డ్రైవింగ్
- తరచూ ప్రమాదాలు
- పోలీసుల నిఘా



బండిపై బాలుడు ఉన్నా లెక్కచేయకుండా సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి



ఫోన్ మాట్లాడుతూ వాహనం నడుపుతున్న యువకుడు

కంబాలచెరువు: సెల్‌ఫోన్ అనేది నేడు ప్రతి ఒక్కరికీ అత్యంత అవసరమైన వస్తువుగా మారింది. అది లేకపోతే కాలు బయట పెట్టలేని పరిస్థితి ఏర్పడింది. గతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు జేబులో డబ్బులు పెట్టుకునేవారు. కానీ ఇప్పుడు సెల్ ఫోన్ ఉంటే చాలు. ప్రయాణం, షాపింగ్, భోజనం, సినిమా, విహారం, వినోదం, ఆర్థిక లావాదేవీలన్నీ క్షణాల్లో చేయవచ్చు. ఫోన్ ఉంటే చాలు ప్రపంచమంతా మన చేతిలోనే ఉంటుంది. ఇంత ముఖ్యమైన సెల్‌ఫోన్‌ను విచ్చలవిడిగా వాడడం వల్ల లేనిపోని ప్రమాదాలు జరుగుతున్నాయి. చాలామంది మోటారు సైకిళ్లపై ప్రయాణిస్తూ సెల్ ఫోన్ మాట్లాడుతూ కనిపిస్తున్నారు. భుజానికి, చెవికి మధ్య ఫోన్ పెట్టుకుని మాట్లాడుకుంటూ వెళ్లిపోతుంటారు. ఇది నిబంధనలకు విరుద్ధమని పోలీసులు ఎన్నిసార్లు చెబుతున్నా పట్టించుకోవడం లేదు.

అనేక ప్రమాదాలు

సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడపడం అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్నిసార్లు వాహన చోదకులు మృత్యువాత పడుతున్నారు. ఇంకొన్ని సందర్భాల్లో ఎదురుగా వచ్చే వారిని ఢీకొంటున్నారు. సెల్‌ఫోన్‌కి కాల్ వచ్చినప్పుడు రోడ్డు పక్కన బండి ఆపి, మాట్లాడుకుంటే ఎలాంటి సమస్య ఉండదు. కానీ ఆ విషయాన్ని కొందరు అస్సలు పట్టించుకోవడం లేదు. చెవికి, భుజానికి మధ్యలో సెల్ నొక్కిపెట్టి దృష్టి ఎక్కడో పెట్టి వాహనాలను నడుపుతున్నారు. ఈ సెల్‌ఫోన్ డ్రైవింగ్‌తో ప్రమాదాలకు గురై మంచాన పడుతున్నవారు కొందరైతే, మెడలు వంచి ఫోన్ మాట్లాడి అనారోగ్య సమస్యలు తెచ్చుకుంటున్నవారు ఇంకొందరు. ఎక్కువ రోడ్డు ప్రమాదాలకు సెల్ డ్రైవింగ్ ప్రధాన కారణం అవుతోంది.

1,012 కేసులు

ఇటువంటి ప్రమాదాల నివారించడానికి పోలీసులు చర్యలు ప్రారంభించారు. ఫోన్ మాట్లాడుతూ నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్నా వారిపై నిఘా పెట్టారు. దీనిలో భాగంగా రాజమహేంద్రవరం పరిధిలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 1,012 సెల్‌ఫోన్ డ్రైవింగ్ కేసులు నమోదు చేశారు. వీటి నుంచి రూ.10.12 లక్షల జరిమానా వసూలు చేశారు.

యువతే ఎక్కువ

సెల్ ఫోన్ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడుతున్న వారిలో యువతే అధికంగా ఉంటున్నారు. వీరిలో విద్యార్థులు ఎక్కువగా ఉండడం గమనార్హం. సెల్‌ఫోన్ మాట్లాడుతూ, వాహనాన్ని వేగంగా నడపడం వల్ల అనేక ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఈ విధంగానే రాజమహేంద్రవరం రూరల్‌లో ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఓ యువకుడు ద్విచక్ర వాహనంపై లాలాచెరువు మీదుగా వెళుతూ కూడలిలో లారీకి ఎదురుగా వెళ్లాడు. దీంతో ప్రమాదం జరిగి తీవ్ర గాయాలపాలయ్యాడు. ప్రమాదంపై దర్యాప్తు చేసిన పోలీసులు స్థానికంగా ఉన్న సీసీ ఫుటేజీలు పరిశీలించారు. ఆ యువకుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్న ఆ యువకుడు ట్రాఫిక్ సిగ్నల్ పడినా గమనించకుండా ఎదురుగా మలుపు తిరుగుతున్న లారీని ఢీకొట్టినట్లు గుర్తించారు. ఇలాగే కోటగుమ్మం సెంటర్‌లో వాహనం నడుపుతున్న ఓ యువకుడు రోడ్డు డివైడర్‌ను ఢీకొని తీవ్ర గాయాలపాలయ్యాడు.

ప్రమాదకరం



"సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం చాలా ప్రమాదకరం. దీని వల్ల ఫోన్ మాట్లాడే వారితో పాటు ఎదురుగా వస్తున్న వాహన చోదకులు కూడా ప్రమాదాల బారిన పడుతున్నారు. డ్రైవింగ్‌లో ఫోన్ వస్తే రోడ్డు పక్కగా వెళ్లి వాహనాన్ని నిలిపి మాట్లాడుకోవాలి. ఈ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. సెల్ ఫోన్ డ్రైవింగ్ చేస్తున్న వారిపై నిఘా పెట్టాం. ఎక్కడికక్కడ తనిఖీలు చేస్తూ కేసులు నమోదు చేస్తున్నాం."

– ఎం.వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ డీఎస్పీ

సౌకర్యాల మెరుగుకు చర్యలు తీసుకుంటాం

రాజమహేంద్రవరం సిటీ: నగరాన్ని ఆనుకొని ఉన్న పంచాయతీలలో సౌకర్యాలు మెరుగుపరచడానికి చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్, శివారు గ్రామ పంచాయతీల స్పెషల్ ఆఫీసర్ కేతన్ గార్గ్ అన్నారు. దివాన్ చెరువు, హుకుంపేట పంచాయతీలలో గురువారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వివిధ అభివృద్ధి పనుల ప్రతిపాదనలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దివాన్ చెరువు పంచాయతీలో మురుగు నీరు పారడానికి అడ్డంగా ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని, పారిశుద్య నిర్వహణలో అలసత్వం ప్రదర్శించరాదన్నారు.